# రేపు జాతీయ లోక్ అదాలత్

- **జిల్లా జడ్జి రాజేశ్‌బాబు**

నాగర్‌కర్నూల్, మార్చి 14: రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మొదటి జాతీయ లోక్ అదాలత్‌ను ఈనెల 16న నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు భవన సముదాయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా జడ్జి రాజేశ్‌బాబు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ కోర్టు భవనాల సముదాయాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. 'రాజీ మార్గమే రాజ మార్గం' అని రాజీ అవ్వదగు క్రిమినల్ కేసులు, భూ తగాదా కేసులు, మోటరు వెహికల్ ప్రమాదాల కేసులు, బ్యాంకు కేసులు, బీఎస్ఎన్ఎల్ కేసులు, పెట్టీ కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. భూతగాదాకు సంబంధించిన కేసులు రాజీ అయినప్పుడు కోర్టు ఫీజు వాపసు ఇవ్వబడుతుందని, ఇరువర్గాలు రాజీ కావడం వల్ల సమయాభావం, ఖర్చులు తగ్గించుకోవచ్చని, క్రిమినల్ కేసుల్లో రాజీ అయితే చదువుకునే విద్యార్థులు, గవర్నమెంట్ ఉద్యోగాలకు ఎటువంటి ఇబ్బంది ఏర్పడదని, కేసులు రాజీ కావడం వల్ల కక్షిదారులకు, ఇరువర్గాల వారికి సుఖసంతోషాలతో జీవించవచ్చని, లోక్ అదాలత్‌లో రాజీ అయితే ఇరువర్గాలు గెలిచినట్లే అవుతుందని జడ్జి తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

అచ్చంపేటటౌన్, మార్చి 14: పట్టణంలో ఐదు కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షకు మొత్తం 934 మంది విద్యార్థులకు గాను 62 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 872 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్ష నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో158 మంది విద్యార్థులకు గానూ 146 మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 171 మందికి గానూ 156, ప్రగతి జూనియర్ కళాశాలలో 209 మందికి గానూ 192, త్రివేణి జూనియర్ కళాశాలలో 206 మందికి గానూ 195, చైతన్య జూనియర్ కళాశాలలో 190 మంది విద్యార్థులకు గానూ 183 మంది విద్యార్థులు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్లు వెంకటయ్య, జయమ్మ, శోభారాణి, శ్రీనివాస్ గౌడ్, రవి, మల్లయ్య తెలిపారు.

### కల్వకుర్తిలో 51 మంది గైర్హాజర్

కల్వకుర్తి రూరల్, మార్చి 14: కల్వకుర్తి పట్టణంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, వైఆర్ఎం, ఎంజేపీ కల్వకుర్తి, ఎంజేపీ ఊర్కొండ, కృష్ణవేణి, న్యూఎరా కళాశాలల్లో 1,188మంది విద్యార్థులకుగాను 51మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, 1,137మంది హాజరయ్యారని ఎగ్జామ్స్ చీఫ్ సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి తెలిపారు.

### తిమ్మాజిపేటలో ఇద్దరు..

తిమ్మాజిపేట, మార్చి 14: ఇంటర్ ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణ అధికారి వెంకన్న తెలిపారు. మొత్తం 132 మందికి గానూ 130 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు

బిజినేపల్లి, మార్చి 14: రాబోయే లోక్ సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ పుష్పావతి అన్నారు. మండలంలోని పాలెం వ్యవసాయ కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అవగాహన సదస్సును ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎస్ ఆఫీసర్ సాధన, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

# పాల బిల్లులు వెంటనే చెల్లించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాడి రైతులు

కల్వకుర్తి రూరల్, మార్చి 14: పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించి పాడి రైతులను ఆదుకోవాలని పాల సేకరణ కేంద్రాల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, పాడి రైతులు కోరారు. గురువారం కల్వకుర్తిలోని పాలశీతలీకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రెండు నెలలుగా పాల బిల్లులను చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచడం ద్వారా పాడి రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాల బిల్లులను ప్రతి 15రోజులకు పాడి రైతుల ఖాతాల్లో జమ చేసేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమస్యను హైదరాబాద్‌లోని విజయ డెయిరీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోగా, నాలుగు రోజుల్లో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని చెప్పి చెల్లించలేదని వాపోయారు. బిల్లులు వెంటనే చెల్లించకపోతే పాడి రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పాలసేకరణ కేంద్రాల అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వీరయ్య, చంద్రశేఖర్ ఉన్నారు.

## పీజీ కాలేజ్ వసతి గృహంలో మెస్ ప్రారంభించాలి

కొల్లాపూర్, మార్చి 14: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని కొల్లాపూర్ పీజీ కళాశాలలో వెంటనే మెస్‌ను ప్రారంభించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కళాశాలలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు శేఖర్ అధ్యక్షతన వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాము హాజరయ్యారు. యూనివర్సిటీ ప్రారంభం నుంచి హాస్టల్ భవనాలున్నా అందులో మెస్‌ను ప్రారంభించలేదన్నారు. దీనివల్ల సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడి వస్తున్న విద్యార్థులు హాస్టల్ గదుల్లోనే భోజనం చేసుకొని తరగతులకు సమయానికి రాలేకపోతున్నారన్నారు. సెమిస్టర్ పరీక్షలు ఉన్నందు వల్ల ఎదుర్కొంటున్నారని బత్తి ని రా ము పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం స్పందించాలని లేకపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూ నాయకులు దాస్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యూసూఫ్, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు భరత్ యాదవ్, ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం

- **పట్టు వస్త్రాలు అందజేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు**
- **వేడుక తిలకించేందుకు తరలొచ్చిన భక్తులు**



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

అమ్రాబాద్, మార్చి 14: పదర మండలం రాయలగండి లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆయన సతీమణి జెడ్పీటీసీ అనురాధ పాల్గొని స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య వారి చేతుల మీదుగా కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు తరలి వచ్చారు. అనంతరం నిర్వాహకులు కోలాటం, భజన, వాలీబాల్ పోటీలు నిర్వహించి గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. రాత్రి ఆలయ ఆవరణలోసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



తలంబ్రాలతో వస్తున్న మాలమహానాడు నాయకులు

### అచ్చంపేట నుంచి తలంబ్రాల ఊరేగింపు

అచ్చంపేట, మార్చి 14: రాయలగండి లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణ తలంబ్రాలను గురువారం అచ్చంపేట నుంచి భక్తి శ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. మాలమహానాడు, మాల ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదర్శనగర్ మాలమహానాడు భవనంలో మహిళలు భక్తిశ్రద్ధలతో తలంబ్రాల బియ్యం కలిపి మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా పదర మండలం రాలయగండి లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాలమహానాడు అధ్యక్షుడు బాలస్వామి, ఉద్యోగుల ఐక్యవేదిక అధ్యక్షుడు అంజనేయులు, ప్రధానకార్యదర్శి రవీందర్, నిరంజన్, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, జీవన్ కుమార్, శ్రీనివాసులు, కపిల్‌దేవ్, రవి, నారాయణ, రామస్వామి, శ్రీను, తిరుపతయ్య, శ్రీశైలం, సామవెంకటేశ్, మోహన్, జానకిరాం, రాధమ్మ, ఝాన్సీ, గోపాలమ్మ, శశికళ, రత్నమాల, మాధవి, పద్మ, లక్ష్మికాంతమ్మ, విజయ, సునీత, ఇందిరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

బల్మూరు, మార్చి14: మండలంలోని రామాజిపల్లి గ్రామంలో గురువారం ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేద పండితులు గణపతి పూజ, యజ్ఞ, హోమాలు నిర్వహించారు. శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయనున్నట్లు నిర్వహక కమిటీ తెలిపింది.

## సభను విజయవంతం చేయాలి

కల్వకుర్తి రూరల్, మార్చి 14: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించనున్న ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని కల్వకుర్తి బీజేపీ నాయకులు కోరారు. గురువారం కల్వకుర్తిలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రధాని మోదీ సభకు కల్వకుర్తి నియోజక వర్గంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు శేఖర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, కృష్ణగౌడ్, రాఘవేందర్‌గౌడ్, నర్సింహ, వివేకానంద, రవిగౌడ్ ఉన్నారు.

## రఘువీర్ ప్రతాప్‌కు కీర్తి పురస్కారం

పెద్దకొత్తపల్లి, మార్చి 14: మండల పరిధిలోని కల్వకోలు గ్రామానికి చెందిన ప్రముఖ కవి రచయిత ఎన్.వి రఘువీర్ ప్రతాప్‌కు సాహిత్యరంగంలో చేస్తున్న విశేష కృషిని గుర్తిస్తూ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు బుధవారం రఘువీర్‌ప్రతాప్‌కు కీర్తి పురస్కారాన్ని అందజేశారు. దీంతో కొల్లాపూర్‌కు చెందిన కవులు, కళాకారులు, రచయితలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈసందర్భంగా రఘువీర్‌ను సన్మానం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో కవులు పరశురాముడు, వెంకటదాసు, కోటయ్య, శ్యాంసుందర్ ఉన్నారు.

## శ్రామికుల మార్గదర్శి కారల్ మార్క్స్

నాగర్‌కర్నూల్, మార్చి 14: శ్రామికుల మార్గదర్శి, సమ సమాజ నిర్మాణ సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ అని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ అన్నారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కారల్ మార్క్స్ 141 వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెట్టుబడిదారి శక్తులు కార్మికులను ఏ రకంగా దోచుకుంటున్నదో తెలిపిన నాయకుడు కారల్ మార్క్స్ అన్నారు. తన పెట్టుబడి గ్రంథంలో ఆర్థిక సంక్షోభాలు ఎలా ప్రారంభమవుతాయి, వాటి పరిష్కార మార్గాలు ఏమిటనేది తెలియజేశారన్నారు. దోపిడీ వ్యవస్థ పోవాలంటే మార్క్స్ చూపిన మార్గమే సరైందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యనారాయణ, సురేశ్, నర్సింహ, శివరాం, నరేందర్‌రెడ్డి, మనోహర్, వెంకటయ్య పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ గణిత దినోత్సవం

అచ్చంపేటటౌన్, మార్చి 14: అచ్చంపేట మండలం నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రపంచ గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సామ్యానాయక్ మాట్లాడుతూ గణితంలో " పై " విలువ 3.14 కనుక ఈ విలువను తెలియజేసేవిధంగా ఉన్న మార్చి 14వ తేదీన ప్రపంచ గణిత దినోత్సవంగా జరుపుకొంటారని తెలిపారు. అనంతరం గణిత బోధన అభ్యసన సామగ్రి, ఐఎల్ఎంల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీశైలం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్యాక్ వాకింగ్‌తో ప్రయోజనం

కొల్లాపూర్, మార్చి 14: పట్టణంలోని స్టేడియంలో వాకర్స్, యోగా సంఘం సభ్యులు పతాంజలి యోగా జిల్లా అధ్యక్షుడు అల్వాల అర్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం బ్యాక్ వాకింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్జున్‌గౌడ్ మాట్లాడుతూ బ్యాక్ వాకింగ్ చేయడం వల్ల అనేక రకాల ప్రయోజనాలున్నాయన్నారు. వెరికోసిస్ సమస్యతో బాధపడుతున్న స్త్రీలు, పురుషులకు గుండె సంబంధమైన వారికి జాయింట్ పెయిన్స్ ఉన్న వారికి ఎంతో ఉపయోగపడుతుందని, లండన్ యూనివర్సిటీ పరిశోధకులు తెలిపారన్నారు. ప్రతిఒక్కరూ నిత్యం 15నిమిషాల నుంచి అరగంట వరకు బ్యాక్ వాకింగ్ చేయడం మూలంగా ఆరోగ్యంగా ఉండాలని అర్జున్‌గౌడ్ వాకర్స్‌కు సూచించారు. కార్యక్రమంలో యోగా సభ్యులు నారాయణయాదవ్, రమేశ్, మల్లికార్జున్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రాలమ్మ సిడే



మంత్రాలమ్మ జాతరలో సిడే ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కోడేరు, మార్చి 14: మండల పరిధిలోని జనుంపల్లి గ్రామ శివారులో వెలసిన మంత్రాలమ్మ ఆలయంలో గురువారం సాయంత్రం సిడే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు జిల్లాలోని నలుమూలలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మంత్రాలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు నిర్వహించే సిడే కార్యక్రమానికి ముందుగా ఆలయంలో కొలువుదీరిన మంత్రాలమ్మ అమ్మవారికి ఆలయ పూజారి మద్దిలేటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజారి ఒంటి నిండా పసుపు( బండారు) తో బండి సిడేకు కట్టి ఆలయం చుట్టూ తిప్పారు. సిడేకు ముందు భాగంలో డప్పు వాయిద్యాలు శివసత్తుల పూనకాలతో పెద్దఎత్తున ముందుకు కదిలారు. పూజారి పసుపు, వేపాకు నిమ్మకాయలను కిందికి చల్లడంతో భక్తులు వాటిని పట్టుకునేందుకు ఎగబడ్డారు. అనంతరం పూజారిని కిందికి దించాక ఖాళీ సిడే రథం బండిని మరో రెండుసార్లు ఆలయం చుట్టూ తిప్పారు. ఈ సందర్భంగా భక్తులు నైవేద్యాన్ని, గొర్రెపొటేళ్లను అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించారు. సిడే కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కోడేరు ఎస్సై కురుమూర్తి బందోబస్తు నిర్వహించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి వసతి ఏర్పాటు చేశారు.



బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

# ప్రధాని మోదీకి అడుగుపెట్టే నైతికహక్కు లేదు

- **ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్**



సింగవట్నంలో పాదయాత్ర చేస్తున్న సంపత్ కుమార్

కొల్లాపూర్, మార్చి 14: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయని ప్రధాని మోదీకి ఈ గడ్డపై అడుగుపెట్టే అర్హత లేదని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. చలో కొల్లాపూర్ పేరున గురువారం కొల్లాపూర్ మండలం సింగవట్నంలో అంబేద్కర్ విగ్రహం నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు పాదయాత్ర నిర్వహించిన సంపత్‌కుమార్, అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ పదేండ్ల పాలనలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఫలానా అభివృద్ధి చేశామని ఆ పార్టీ నాయకులు చూపించాలన్నారు. అందువల్లే బీజేపీకి గ్రామాల్లో కార్యకర్తలు లేరన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి అరువు తెచ్చుకున్న అభ్యర్థిని బీజేపీ నుంచి పోటీలో నిలబెట్టుకొనే దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. ప్రధాని కందనూలు సభకు వచ్చే ముందు ఏమైనా ఇచ్చే హామీ ఉంటే, ముందే ప్రకటించి రావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటస్వామి, వెంకటస్వామి, బాలరాజు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎగ్బాల్ తదితరులున్నారు.

### పాదయాత్రకు దూరం

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నాగర్‌కర్నూల్ (ఎస్సీ రిజర్వు) పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను ఆశిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ గురువారం పాదయాత్ర చేపట్టారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఇలాకాలో సంపత్ కుమార్ చేపట్టిన పాదయాత్రపై మంత్రి ప్రమేయం లేకుండా సంపత్ ఏకపక్ష నిర్ణయం తీసుకొనే ఈ పాదయాత్ర చేపట్టారా? లేక జూపల్లి ఇమేజ్‌ని డ్యామేజ్ చేయాలన్న ఉద్దేశమా అని పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. పార్టీ స్థానిక నాయకులు పాద యాత్రక దూరంగా ఉండడంతో తనసొంత నియోజకవర్గం అలంపూర్ నుంచి ప్రత్యేక వాహనాల్లో పార్టీ శ్రేణులను రప్పించుకొని మమ అనిపించారంటున్నారు.

# ఉపాధిపనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

లింగాల, మార్చి 14: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధిహామీ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనుల్లో బినామీ మస్టర్లు ఉండొద్దన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని కూలీలు సకాలంలో పనులు పూర్తి చేసి ఇంటికి చేరుకోవాలన్నారు. ఎన్ఎంఎస్ యాప్‌లో కూలీల హాజరు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు చేసే తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. పనులు చేసిన వారం, పది రోజుల్లో కూలి డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో మొక్కలు సక్రమంగా పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో,పంచాయతీ కార్యదర్శులు,పాల్గొన్నారు.

### మొక్కలు ఎండకుండా చూడాలి

ఉప్పునుంతల, మార్చి 14: మండలంలోని తాడూర్ నర్సరీని గురువారం ఎంపీడీవో లక్ష్మణ్‌రావు పరిశీలించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో సుదర్శన్‌గౌడ్, కుర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ, మార్చి 14: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్ అన్నారు. గురువారం మండలంలోని జూపల్లిలో పర్యటించి నర్సరీ, ఉపాధి హామీ పనులు, జీపీ రికార్డులను పరిశీలించారు.

# క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు ప్యాడ్లు అందజేస్తున్న ఎస్సై మహేందర్, ఆనంద్‌గౌడ్

వంగూరు, మార్చి 14: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్సై మహేందర్, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆనంద్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష ప్యాడ్లను ఎస్సై మహేందర్, ఆనంద్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారని వారి ఆశలు ఆవిరి కాకుండా 10వ తరగతి పరీక్షలో మంచి ఫలితాలు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం చెన్నకేశవులు, ఉపాధ్యాయులు సరిత, జయప్రద, శ్రీను, ప్రసాద్, బక్కయ్య, ఫౌండేషన్ సభ్యులు అనిల్, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

కల్వకుర్తి రూరల్, మార్చి14: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకుని, సాధించే దిశగా అడుగులు వేయాలని వీబీస్ పాఠశాల ప్రిన్సిపాల్ రాములు, డైరెక్టర్ యాదగిరి అన్నారు. గురువారం కల్వకుర్తిలోని వీబీస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజు, ఉపాధ్యాయులు విజయ్, దీపక్, నరేశ్, సైదులు, భానుప్రసాద్, శ్రీశైలం, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## చెంచుపెంటలను సందర్శించిన ఆర్డీవో

లింగాల,మార్చి 14: మండలంలోని నల్లమల అటవీప్రాంతంలోని చెంచుపెంటలను గురువారం అచ్చంపేట ఆర్డీవో మాధవి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం చెంచు పెంటల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మండలంలోని నల్లమల ప్రాంతంలో పుల్లయ్యపల్లి, మేడిమల్కాల, సంగడిగుండాల, అప్పాపూర్, రాంపూర్ పెంటల్లోని చెంచులు ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో పోలింగ్ అధికారులు ఓటర్లకు అన్నిరకాల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట తాసీల్దార్ ఉమ, పంచాయతీ కార్యదర్శి జైపాల్ ఉన్నారు.

## ఆగ్రో రైతుసేవా కేంద్రాల తనిఖీ

తిమ్మాజిపేట, మార్చి 14: మండల కేంద్రంలోని ఆగ్రో సేవా కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీవోఎస్ మిషన్‌లో క్రయవిక్రయాలను పరిశీలించారు. దీంతో పాటు కేంద్రంలో ఉన్న ఎరు వుల నిల్వలను పరిశీలించి, ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని సూచించారు. అనంతరం ఇఫ్కో బజార్‌ను తనిఖీ చేశారు.

## రాష్ట్ర ఖజానాకు రూ.70,600 ఆదాయం

కొల్లాపూర్, మార్చి 14: అక్రమంగా నాటుసారా రవాణా చేస్తూ పలుచోట్ల పట్టుబడిన కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఐదుద్విచక్ర వాహనాలకు కొల్లాపూర్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో గురువారం ఉదయం 11గంటలకు వేలం పాట నిర్వహించారు. ఈ ఐదు వాహనాలకు ప్రభుత్వం రూ.57,500లుగా ధర నిర్ణయించింది. అయితే వేలంపాట ద్వారా రూ.70,600లు వచ్చాయని, అలాగే రూ.12,222లు జీఎస్టీ వచ్చినట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో అన్నదానం

కల్వకుర్తి, మార్చి 14: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం కల్వకుర్తి బస్టాండ్‌లో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ ఇంటర్‌నేషనల్ మాజీ గవర్నర్ రమేశ్‌బాబు సహకారంతో ఏర్పాటు చేశారు. పేదలకు చేయూత అందించడంలో లయన్స్ క్లబ్ ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బృందం రమేశ్, శ్రీధర్, గణేశ్, రవి, శ్రీనివాసులు, ప్రకాశ్, ప్రవీణ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో సీసీ కెమెరాలు

ఊర్కొండ, మార్చి 14: ఊర్కొండ పేటలోని జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం శ్రావణ్‌కుమార్ తెలిపారు. మొత్తం ఏడు కెమెరాలు అమర్చామని, దీనికోసం పాఠశాల నిధులు వెచ్చించామని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా చూడటం, బడికి రక్షణ కల్పించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

## పంటల పరిశీలన

బిజినేపల్లి, మార్చి 14: మండలంలోని లింగసానిపల్లి శివారులో సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలను గురువారం వ్యవసాయాధికారి పరిశీలించారు. పంటలకు ఆశించే చీడపీడలు గమనించి, నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించామన్నారు. కార్యక్రమంలో ఏఈవో హైమ, రైతులు ఉన్నారు.

## కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

బల్మూరు, మార్చి14: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని కొండనాగుల దొంతికుంట మైసమ్మ దగ్గర గురువారం చోటు చేసుకున్నది. ఎస్సై బాలరాజు కథనం మేరకు కొండనాగుల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పని చేసే బాల్య విధులు ముగించుకొని స్కూటీపై అచ్చంపేటకు వెళ్తుండగా లింగాల నుంచి వస్తున్న కారు అతివేగంతో వచ్చి స్కూటీని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బాల్యకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించిన 108 అంబులెన్స్ ద్వారా అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదారబాద్‌కు తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మృతదేహం గుర్తింపు

బల్మూరు, మార్చి14: మండలంలోని మైలారం శివారులో బుధవారం గుర్తు తెలియని మహిళ శవం లభించడంతో పోలీసులు అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గురువారం నాగర్‌కర్నూల్ మండలం ఎండ్లబెట్లకు చెందిన రేణుకగా గుర్తించారు. కొన్నిరోజులుగా కనిపించకుండా పోవడంతో మృతురాలు ధరించిన చీర, గాజులు తదితర వాటి ద్వారా గుర్తించినట్లు సమాచారం.

## ఇసుక ట్రాక్టర్ సీజ్

కల్వకుర్తి రూరల్, మార్చి 14: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి అన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణ సమీపంలో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## హక్కుల సాధన కోసం పోరాడాలి

అచ్చంపేటరూరల్, మార్చి 14: గిరిజనులు హక్కుల కోసం పోరాటం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూడావత్ ధర్మానాయక్ అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం ఆవరణంలో గురువారం గిరిజన గర్జన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞన కేంద్రంలో గిరిజన హక్కుల గర్జన పేరుతో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలతో మరో సారి ప్రజల ముందుకు రాబోతున్నదన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవా అధ్యక్షుడు దేశ్యానాయక్, ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, నాయకులు శ్రీను,రాజేశ్,పవన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.